

జన కేతనం
ప్రశ్నించడమే పాపమా!?
అత్యధిక, అత్యల్ప మెజారిటీలు
ఎన్నికల వేళ.. ఉపాధి మేళా
· 7లో

బూడికి ఇంటిపోరు!

వైసీపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి ఇంటా, బయటా అసమ్మతి



ఇటీవల బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సీనియర్ నేత కిలపర్తి భాస్కరరావు, తదితరులు



- మాడుగుల అసెంబ్లీ స్థానాన్ని కుమార్తెకు కేటాయించడంతో భగ్గుమన్న మొదటి భార్య కుమారుడు
- స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..
- పార్టీని వీడుతున్న సీనియర్ నాయకులు
- ముత్యాలనాయుడు వర్గీయులు డీలా

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

వైసీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఇంటి పోరు ఎక్కువగా ఉందా?.. సొంత నియోజకవర్గం మాడుగులలోనే అసమ్మతి తీవ్రంగా ఉందా?..సొంత పార్టీ నాయకుల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతుందా?..అంటే అవుననే సమాధానం వస్తోంది. ఆయనకు అన్నీ ప్రతికూల పరిస్థితులే ఉన్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

మాడుగుల అసెంబ్లీ స్థానం నుంచి బూడి ముత్యాలనాయుడు 2014, 2019 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. ఈసారి కూడా అక్కడ నుంచే పోటీ చేయాలనుకున్నారు. పార్టీ అధిష్ఠానం తొలుత టికెట్ కూడా ఖరారు చేసింది. అయితే అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గానికి కూటమి తరపున సీఎం రమేశ్ (బీజేపీ) పోటీ చేస్తుండడంతో అదే సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడును ఎంపీ అభ్యర్థిగా పోటీలో నిలుపుతున్నట్టు వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో అయిష్టంగానే బూడి ముత్యాలనాయుడు ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో మాడుగుల అసెంబ్లీ స్థానాన్ని తన కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధకు ఇప్పించుకున్నారు. దీంతో సొంత పార్టీతో పాటు కుటుంబం నుంచి కూడా అసమ్మతి చెలరేగింది.

కుటుంబంలోనే వ్యతిరేకత

బూడి ముత్యాలునాయుడుకు ఇంటి పోరు పెద్ద తలనొప్పిగా మారింది. రెండో భార్య కుమార్తె అనురాధకు మాడుగుల అసెంబ్లీ స్థానం ఇవ్వడంతో మొదటి భార్య కుమారుడు రవికుమార్ భగ్గుమన్నారు. ఆయన మాడుగుల నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. మరోవైపు బూడి మొదటి భార్య తమ్ముడు, వరుసకు బావమరిది అయిన గంగాధర్ బీజేపీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల బూడి స్వగ్రామం తారువలో ప్రచారం చేస్తున్న గంగాధర్‌పై బూడి వర్గీయులు దాడి చేయడం, పరామర్శకు వెళ్లిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడికి పాల్పడడంతో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే.

జారుకుంటున్న వైసీపీ నేతలు

ఇంటిపోరును ఎదుర్కొంటున్న బూడి ముత్యాలనాయుడిని సొంత పార్టీలోనూ అసమ్మతి పోరు వెంటాడుతోంది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని నర్సీపట్నం, ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో పెద్దసంఖ్యలో వైసీపీ శ్రేణులు పార్టీని వీడి టీడీపీ, జనసేనల్లో చేరిపోతున్నాయి. తాజాగా బూడి సొంత నియోజకవర్గమైన మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలానికి చెందిన వైసీపీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, ఆమె భర్త, సీనియర్ వైసీపీ నాయకుడు కిలపర్తి భాస్కరరావు బూడికి షాకిచ్చారు. మారేపల్లి వైసీపీ సర్పంచ్ కన్నతల్లి, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవితో కలిసి వందలాది మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. దీంతో బూడి వర్గం డీలా పడిందని తెలిసింది.

గాజువాక సభలో సీఎం జగన్ ప్రసంగిస్తుండగా వెనుతిరిగివెళ్లిపోతున్న జనం



జనం జంప్

గాజువాక సభలో జగన్ ప్రసంగిస్తుండగానే వెనుతిరిగిన వైనం

- ఆపడానికి నేతలు యత్నించినా ఆగని మహిళలు
- ఎందుకు వెళ్లిపోతున్నారని ప్రశ్నిస్తే...
- ఇచ్చిన రూ.300కు మధ్యాహ్నం రెండు నుంచి ఏడు గంటల వరకూ ఉండాలా అంటూ ఎదురుప్రశ్న
- డ్వాక్రా సంఘాలు/వలంటీర్ల ద్వారా సభకు జనం సమీకరణ
- గాజువాకతోపాటు పరవాడ నుంచి ఆటోల్లో తరలింపు
- సభకు వచ్చినవారి పేర్లు రాసుకుని, గ్రూపు ఫొటోలు
- సభ జరిగిన ప్రాంతంలో దుకాణాలు మూత
- గాజువాక సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేరు ప్రస్తావించని జగన్



మాట్లాడుతున్న జగన్

విశాఖపట్నం/గాజువాక, మే 7 (ఆంధ్రజ్యోతి):

గాజువాకలో మంగళవారం ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచారసభలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగిస్తుండగానే జనం వెనుతిరిగిపోవడం వైసీపీ నేతలను విస్మయానికి గురిచేసింది. సాయంత్రం ఐదు గంటలకు సభ ప్రారంభమవుతుందని అధికారికంగా ప్రకటించినప్పటికీ స్థానిక నేతలు అత్యుత్సాహంతో మధ్యాహ్నం మూడు గంటలకని చెప్పి రెండు గంటల నుంచే గాజువాకతోపాటు పరవాడ వంటి ప్రాంతాల నుంచి మహిళలను ఆటోల్లో తరలించారు. సాయంత్రం ఆరు గంటలకు సీఎం వచ్చి, ప్రసంగం మొదలెట్టారు. అప్పటికే నీరసించిపోయిన మహిళలు సీఎం ప్రసంగాన్ని వినే ఓపిక లేకపోవడంతో వెనుతిరిగిపోవడం ప్రారంభించారు. మహిళలంతా ఒకేసారి వెళ్లిపోతుండడంతో వేదిక పై నుంచి నేతలు వారిని ఆపాలంటూ కిందనున్న వారికి సంజ్ఞలు చేశారు. వారంతా వెనుతిరిగిపోతున్నవారిని ఆపేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. సీఎం జగన్ పాతచింతకాయపచ్చడి మాదిరిగా గత రెండు రోజులుగా చెబుతున్న మాటలు, చేస్తున్న విమర్శలనే తిరిగి వల్లె వేస్తుండడంతో సభకు హాజరైన పురుషులు కూడా వెనుతిరిగారు. ఇరుకుగా ఉండే పాతగాజువాక జంక్షన్ నుంచి వంటిల్లు జంక్షన్ మధ్య రోడ్డులో సభను పెట్టడంతో ఆ మార్గంలోని దుకాణాలను పోలీసులు ముందుగానే మూసివేయించారు.

సభకు మహిళలను తీసుకొచ్చే బాధ్యతను డ్వాక్రా సంఘాల అధ్యక్షులకు, గతంలో వలంటీర్లుగా పనిచేసి మానేసినవారికి అప్పగించారు. వారంతా తమకు ఇచ్చిన టార్గెట్ మేరకు మహిళలను నేతలు సమకూర్చిన ఆటోల్లోనే సభావేదిక వద్దకు తరలించారు. అక్కడ వారందరి పేర్లను నమోదుచేసుకుని, గ్రూపు ఫొటో తీసి తమకు బాధ్యత అప్పగించిన నేతలకు పంపించడం కనిపించింది.

సభ మధ్యలోనే వెనుతిరిగిపోతున్న మహిళలను సీఎం ప్రసంగం ముగియకుండానే ఎందుకు వెళ్లిపోతున్నారని ఆరా తీస్తే 'మాకు ఇచ్చిన రూ.300కి మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి ఏడు గంటలు వరకూ ఇక్కడే ఉండిపోవాలా? ఇంట్లో పనులేవీ ఉండవా?' అంటూ ఎదురు ప్రశ్నించారు. సీఎం తన ప్రసంగంలో ఉత్తరాంధ్రకు నాలుగు మెడికల్ కాలేజీలు ఇచ్చామని, భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, నాలుగుచోట్ల కొత్తగా పోర్టులు, ఫిష్ జోన్‌లు నిర్మిస్తున్నామని, నాడు-నేడులో భాగంగా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశామని, రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు ... మిగతా 8వ పేజీలో



కృష్ణాదేవిపేటలో అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న క్షత్రియ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతిరాజు, సంఘ నాయకులు

అల్లూరి పార్కును విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

- క్షత్రియ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతిరాజు ఆవేదన

గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అల్లూరి పార్కు అభివృద్ధిని విస్మరించిందని క్షత్రియ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి శత వర్ధంతి సందర్భంగా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి పార్కులో అల్లూరితో పాటు గంటందొర సమాధుల వద్ద ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- వార్త 6వ పేజీలో..



చోడవరంలో మంగళవారం ఉదయం వర్షం

వర్షంతో ఊరట

- జిల్లాలో పలు చోట్ల వాన

జిల్లాలో పలుచోట్ల మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు జోరువాన కురిసింది. ఇటీవల ఎండ తీవ్రతకు అల్లాడుతున్న జనం వర్షానికి ఊరట చెందారు. చోడవరం, రావికమతం, చీడికాడ, మాడుగుల, కోటవురట్లలో వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. - చోడవరం

నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- 6, 7 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోని ఉద్యోగులకు అవకాశం

అనకాపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ బుధవారంతో ముగియనున్నది. ఈ నెల 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌లో పాల్గొనని ఉద్యోగులు 8వ తేదీన ఒక్కరోజు మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు వారికి కేటాయించిన ఫెసిలిటేషన్ సెంటర్లలో బుధవారం సాయంత్రంలోగా స్వయంగా హాజరై ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు. కాగా అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలో ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకొనేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు సుమారు 16 వేల మంది ఉండగా, తొలి రోజైన సోమవారం 5,126 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం సుమారు ఐదు వేల మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిసింది.

దర్జాగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

పూడిమడక సముద్ర తీరంలోని లైట్‌హౌస్ వద్ద భారీగా తవ్వి తరలింపు



పూడిమడక సముద్ర తీరంలో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

- వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో బరితెగింపు
- పట్టించుకోని అధికారులు

అచ్యుతాపురం, మే 7:

పూడిమడక సముద్ర తీరంలోని లైట్‌హౌస్ వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులకు వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పూడిమడకలో పొగిరి వద్ద హార్బర్ నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించారు. సముద్ర తీరంలో నిర్మించే హార్బర్‌కి పూడిమడక నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. పూడిమడక- లోవపాలెం రోడ్డు నుంచి సముద్ర తీరం వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా పూడిమడక శివారు జాలరిపాలెం కొండ వద్ద లైట్‌హౌస్‌ను నిర్మించారు. ఈ కొండ వద్ద గ్రావెల్ ఉంటుందన్న విషయం ఇంతవరకు ఎవరికీ తెలియదు. సముద్ర తీరం కాబట్టి ఈ ప్రాంతమంతా ఇసుక ఉంటుంది. కానీ ఈ ప్రాంతంలో మూడు అడుగుల ఇసుక తొలగించిన తరువాత మంచి గ్రావెల్ నిక్షేపాలున్నట్టు కాంట్రాక్టర్ గుర్తించాడు. ప్రస్తుతం పూడిమడక పంచాయతీ వైసీపీ అధికారంలో ఉంది. అంతే నాయకులతో మాట్లాడి గుట్టుచప్పుడు కాకుండా భారీ యంత్రాలతో తవ్వకాలు ప్రారంభించారు. సాధారణంగా మత్స్యకారులు జాలరిపాలెం- కడపాలెం మధ్య పడవలు పెట్టి ప్రతి రోజు చేపల వేట కొనసాగిస్తుంటారు. లైట్‌హౌస్ వెనుక వైపునకు వెళ్లరు. అందువల్ల భారీ స్థాయిలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా ఈ విషయం ఇంతవరకు వారికి తెలియలేదు. మంగళవారం కొంత మంది మత్స్యకారులు అటుగా వెళ్లడంతో ఈ విషయం బయటపడింది. ఇప్పటికే భారీ స్థాయిలో గ్రావెల్ తవ్వి రోడ్డు వేసేశారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సముద్రపు అలలు లైట్‌హౌస్ వెనుక ఉన్న కొండను తాకుతాయి. ప్రస్తుతం లైట్ హౌస్ కొండకు, సముద్రానికి మధ్య భారీ స్థాయిలో గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. దీంతో గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే మంగళవారం సాయంత్రం పనులను అడ్డుకున్నామని, దీనిపై పోరాటం చేస్తామని సీపీఎం నాయకుడు చేపల తాతలు తెలిపారు.



పూడిమడక శివారు జాలరిపాలెం లైట్‌హౌస్ వద్ద తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. భీమిలి				
2. విశాఖ తూర్పు				
3. విశాఖ పశ్చిమ				
4. విశాఖ ఉత్తరం				
5. విశాఖ దక్షిణం				
6. గాజువాక				
7. పెందుర్తి				
8. అనకాపల్లి				
9. యలమంచిలి				
10. పాయకరావుపేట				
11. నర్సీపట్నం				
12. చోడవరం				
13. మాడుగుల				
14. పాడేరు				
15. అరకు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎన్.హెచ్.16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530016.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు

» అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మే 7: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో మౌలిక వసతుల కల్పనపై ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన కుర్చీలు, బల్లలు, విద్యుత్, తాగునీరు, ర్యాంప్, వీల్‌ఛైర్, మరుగుదొడ్డి, ఓటర్లకు సహాయకుడు విధిగా ఉండాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు జనరేటర్, నీడకు టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా టీ, అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించాలన్నారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, పోలింగ్ పూర్తయిన తర్వాత సిబ్బంది తిరిగి వెళ్లే వరకు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. వీటికి అవసరమైన ఖర్చులు ఎన్నికల నిధుల నుంచి కేటాయించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ దయానిధి, నోడల్ అధికారులు సుబ్బలక్ష్మి, రమామణి పాల్గొన్నారు.

జిల్లాలో వంద శాతం వెబ్ కాస్టింగ్

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో (పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంతో కలిపి) 15,96,916 మంది ఓటర్లు ఉన్నారని, 4,449 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారన్నారు. 1,828 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎన్నికల నిర్వహణకు 1,859 మంది ప్రీసైడింగ్ అధికారులు, 1,927 మంది సహాయ ప్రీసైడింగ్ అధికారులు, 7,480 మంది ఇతర పోలింగ్ సిబ్బంది ఉన్నారన్నారు. 380 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. 880 మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ దయానిధి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

» లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

తుమ్మపాల, మే 7: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. మంగళవారం సంతపాలెం, కొండుపాలెంల్లో పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి పెచ్చుమీరిపోయిందన్నారు. వైసీపీ నాయకులంతా దొంగల ముఠాగా ఏర్పడి రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారన్నారు. రాష్ట్రంలో అక్రమ మద్యం అమ్మకాలు, విద్యుత్‌చార్జీల మోత, బస్ చార్జీల పెంపు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు తదితర అంశాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను సైతం జగన్మోహన్‌రెడ్డి తాకట్టు పెట్టిందని ఆరోపించారు. తాగుబోతుల తలలను సైతం తాకట్టు పెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



అనకాపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, మే 7: స్థానిక గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగింది. అనకాపల్లి నియోజకవర్గంలోని 2,553 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా.. మంగళవారం నాటికి అనకాపల్లిలో ఉద్యోగం చేస్తూ ఇతర జిల్లాలో ఓటు ఉన్న 760 ఓట్లు మంగళవారం అనకాపల్లికి చేరుకున్నాయి. దీంతో మొత్తంగా అనకాపల్లిలో ఓటర్ల సంఖ్య 3,313 కు పెరిగిందని అధికారులు తెలిపారు. తొలిరోజు సోమవారం 968 మంది, రెండో రోజు మంగళవారం 1,502 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పరిశీలించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఆరు గంటలతో ముగియాల్సి ఉన్నప్పటికీ వంద మందికి పైగా ఉద్యోగులు క్యూలో ఉండడంతో వారికి స్లిప్ ఇచ్చి రాత్రి ఎనిమిది గంటల వరకు ఓటింగ్ కొనసాగించినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి మధుసూదనరావు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పట్టణ సీఐ జి. శంకరరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నక్కపల్లిలో..

పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో రెండోరోజు మంగళవారం కూడా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి నక్కపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద రెండు, మండల పరిషత్ కార్యాలయం వద్ద రెండు కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఉద్యోగులు క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ తొలి రోజు 722 మంది, రెండో రోజు 919 మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకున్నారు.కాగా మంగళవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ సరళిని టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత పరిశీలించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

అవును.. వారు ఓటు వేయరు

» ఏ ఎన్నికల్లో అయినా 45 శాతం మంది ఓటు వేయడం లేదు..

» 2014 అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్ 54.11% మాత్రమే

» 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 53.29 శాతం

» మునిసిపల్ ఎన్నికలలో కూడా అదే తీరు

» ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతున్న అధికారులు

శారదానగర్‌లో ఓటింగ్ శాతం తక్కువ



నర్సీపట్నం, మే 7 : విద్యావంతులు, ఉద్యోగస్థులు, ఉపాధ్యాయులు, అత్యంత సంపన్నులు నివసించే శారదానగర్, బ్యాంక్ కాలనీ. శాంతినగర్‌లోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ముందుకు రాక పోవడం అధికారులను విస్మయపరుస్తోంది. ఈ ప్రాంత ప్రజలు శారదానగర్ శారదా స్కూల్ భవనంలోని పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఈ దఫా శారదా స్కూల్ భవనం పడగొట్టడంతో అందులోని 141, 142, 143, 144, 145 పోలింగ్ కేంద్రాలను డాన్‌బాస్కో స్కూల్‌లోకి తరలించారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని మిగిలిన పోలింగ్ కేంద్రాలలో కంటే శారదానగర్ పోలింగ్ కేంద్రంలో తక్కువ పోలింగ్ జరుగుతుంది. ఎన్నికలు ఏవైనా ఇక్కడ ఓటర్లు 55 శాతం కంటే తక్కువ ఓటు హక్కు వినియోగించుకోవడం పరిపాటిగా మారింది. ఇక్కడ ప్రజలు ఓట్లు వేయడానికి రాకపోవడానికి గల కారణాలు ఎన్నికల అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచాలన్న ఉద్దేశంతో ఆర్డీవో హెచ్‌వీ జయరాం సారథ్యంలో ఓటర్లలో చైతన్యం తీసుకు రావడానికి అవగాహన ర్యాలీలు నిర్వహించారు శారదానగర్, బ్యాంక్ కాలనీ, శాంతినగర్‌లో ఇళ్లు నిర్మించుకొని స్థానికేతరులు అధికంగా నివాసం ఉన్నారు. ఇక్కడ ఓటర్లుగా నమోదు చేసుకొని తీరా ఎన్నికల సమయంలో ఓట్లు వేయడానికి ముందుకు రావడం లేదు. నియోజకవర్గంలో మిగిలిన పోలింగ్ కేంద్రాలలో 85 నుంచి 90 శాతంపైగా పోలింగ్ జరుగుతుంది. ఇక్కడ ఓటర్లు ముందుకు రాకపోవడంతో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుంది. 2014 అసెంబ్లీ ఎన్నికలలో శారదానగర్ ఐదు పోలింగ్ కేంద్రాలలో 4,954 ఓట్లకు 2,681 ఓట్లు (54.11 శాతం) పోలయ్యాయి. 2019 అసెంబ్లీ ఎన్నికలలో 5,006 ఓట్లకు 2,668 (53.29 శాతం) పోలయ్యాయి. 2014 మునిసిపల్ ఎన్నికలలో ఒకటో పోలింగ్ కేంద్రంలో 55 శాతం, రెండో పోలింగ్ కేంద్రంలో 68 శాతం పోలింగ్ జరిగింది. 2021 పురపాలక ఎన్నికలలో ఒకటో పోలింగ్ కేంద్రంలో 49.34 శాతం, రెండో పోలింగ్ కేంద్రంలో 59.55 శాతం పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికలకు పోలింగ్ కేంద్రం డాన్‌బాస్కో స్కూల్ భవనంలోని తరలించారు. దీని ప్రభావం పోలింగ్ శాతం ఇంకా తగ్గి పోయే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. శారదానగర్‌లో పోలింగ్ కేంద్రం ఉన్నప్పుడే ఇంట్లోంచి బయటకు వచ్చి ఓట్లు వేయని జనం... డాన్‌బాస్కో స్కూల్ వరకు వచ్చి ఓట్లు వేస్తారా అని అంటున్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి..



నియోజకవర్గంలోని మిగిలిన పోలింగ్ కేంద్రాల కంటే శారదానగర్ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ శాతం చాలా తక్కువ ఉంటుంది. ఓటర్లలో చైతన్యం తీసుకు రావడానికి అనేక సార్లు అవగాహన ర్యాలీలు, సదస్సులు చేపట్టాం. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.

\- హెచ్‌వీ జయరాం, ఆర్డీవో, నర్సీపట్నం

కూటమి ప్రభుత్వంలో అల్లూరికి ప్రత్యేక గుర్తింపు

» జాతీయ స్ఫూర్తి కేంద్రాలుగా సార్మక ప్రాంతాలు

» అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ హామీ

» ఐదేళ్ల వైసీపీ పాలనలో అల్లూరిపై నిర్లక్ష్యం : అయ్యన్న



అల్లూరి విగ్రహం వద్ద సీఎం రమేష్, అయ్యన్నపాత్రుడు, ముత్యాలపాప తదితరుల నివాళి

కృష్ణాదేవిపేట, మే 7 : కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారక ప్రాంతాలను జాతీయ స్ఫూర్తి కేంద్రాలుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ హామీ ఇచ్చారు. అల్లూరి శతవర్థంతి సందర్భంగా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి పార్కులో గల అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాపతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అల్లూరి సమాధులున్న ఈ స్మారక ప్రాంతాల అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. రానున్న కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో స్మారక ప్రాంతాలను జాతీయ స్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో అల్లూరి పార్కును అభివృద్ధి చేస్తే, వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వాపోయారు. ఈ కారణంగానే పార్కు నేడు కళావిహీనంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు చందక గౌరీనాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరి పార్కును విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

» ఐదేళ్లుగా నిధుల విడుదల ప్రకటనలకే పరిమితం

» క్షత్రియ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతిరాజు ఆవేదన

» శత వర్ధంతి సందర్భంగా అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద నివాళి

కృష్ణాదేవిపేట, మే 7: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని క్షత్రియ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతిరాజు అన్నారు. అల్లూరి శత వర్ధంతి సందర్భంగా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి పార్కులో అల్లూరితో పాటు గంటందొర సమాధుల వద్ద ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సౌత్ ఇండియా క్షత్రి పరిషత్ డైరెక్టర్ లక్ష్మీనర్సింహరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అల్లూరి పార్కు అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. నిధులు ప్రకటించడమే తప్ప, కార్యరూపం దాల్చలేదని వాపోయారు. ఐదేళ్ల క్రితం పార్కులో క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో రూ.16 లక్షలతో భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. పార్కులో పర్యాటకులకు తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుతో పాటు, ఇతర అభివృద్ధి పనులకు సంఘం ఆధ్వర్యంలో కృషిచేస్తామని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల సమాధులున్న ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా తీర్చిదిద్దాల్సిన పాలకులు ఆ దిశగా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కారణంగానే నేడు పార్కు కళాహీనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గంటందొర మనుమడు బోడిదొర కూతురు ధారమల్లేశ్వరికి రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు పార్కులో పనిచేస్తున్న సంరక్షకులకు రూ.రెండు వేలను సంఘం తరఫున అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివాజీరాజు, నర్సీపట్నం కార్యదర్శి చక్రపాణిరాజు, నాయకులు సుబ్బరాజు, సూర్యనారాయణరాజు, సుబ్రహ్మణ్యరాజు, సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నూకాంబిక కొత్త అమావాస్య జాతర

» భారీగా తరలివచ్చిన భక్తులు



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులుటు

అనకాపల్లి టౌన్, మే 7: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మంగళవారం జరిగిన నెల పండగతో ముగిసింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో కుటుంబసమేతంగా భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. సాయంత్రం ఆరు గంటలకు భక్తులకు దర్శనం నిలిపివేశారు. బాలాలయాన్ని సంప్రోక్షణ చేసి అమ్మవారికి పూజలు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం పెట్టి ఆలయం తలుపులు మూసివేశారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు యధావిధిగా అమ్మవారి పున:దర్శనం కల్పిస్తామని ఈవో ప్రసాద్ తెలిపారు.

తాకాశివీధిలో వేడుకలు..

కొత్త అమావాస్య జాతరలో భాగంగా స్థానిక తాకాశివీధిలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని, నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తాకాశి రాజేష్, తాకాశి కన్నబాబు, తాకాశి చందు, వీధి పెద్దలు పాల్గొన్నారు.

పేదల పొట్ట కొడుతున్న చంద్రబాబు

» వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న బూడి

అనకాపల్లి టౌన్, మే 7: తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని వైసీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఫిర్యాదుతో డీబీటీ పథకాల కింద నిధుల విడుదలకు ఎన్నికల కమిషన్ నిరాకరించిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తన ఇంటిపై డ్రోన్ ఎగుర వేయడమే కాకుండా తనపై కేసులు నమోదు చేయడం విచారకరమన్నారు. బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరించి తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు

నేటి సాయంత్రం వరకే అప్పన్న నిజరూప దర్శనం టికెట్ల విక్రయాలు

సింహాచలం, మే 7 : వరాహలక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం టికెట్ల విక్రయాలు బుధవారం సాయంత్రం వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.1500, రూ.1000, రూ.300 టికెట్లను ఈనెల 4 నుంచి 7 వరకు విక్రయించామన్నారు. వాటిలో రూ.300 టికెట్లు మాత్రం బుధవారం సాయంత్రం వరకు లభిస్తాయన్నారు. ఉత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొనలేని భక్తులు రూ.1116 టికెట్లను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే వారి గోత్రనామాలను చందనోత్సవం రోజు స్వామివారి సన్నిధిలో చదివి, స్వామివారి చందనం, ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామని చెప్పారు.

క్రైం... crime news

భారీగా గోవా మద్యం పట్టివేత

» దుడ్డుపాలెం సమీపంలో 5,833 మద్యం బాటిళ్లు స్వాధీనం

» అధికార పార్టీకి చెందినదిగా అనుమానం!



దుడ్డుపాలెం వద్ద పట్టుబడిన మద్యం బాటిళ్ల బాక్సుల వద్ద అధికారులు

చోడవరం, మే 7: మండలంలోని చోడవరం- విశాఖపట్నం ప్రధాన రహదారి దుడ్డుపాలెం జంక్షన్ సమీపంలోని ఓ ఇటుకల బట్టీలో అక్రమంగా దాచి ఉంచిన 120 బాక్సుల గోవా మద్యం బాటిళ్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో పాటు, పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎన్నికల కోసం తెప్పించి దాచి ఉంచిన ఈ మద్యం బాటిళ్ల గురించి సమాచారం అందుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సత్యం నాయుడు, సీఐ బి.శ్రీనివాసరావులతో కలిసిన అధికారుల బృందం దుడ్డుపాలెం జంక్షన్ సమీపంలోని ఇటుకల బట్టీ వద్ద తనిఖీలు నిర్వహించగా, ఓ గదిలో దాచి ఉంచిన 120 బాక్సులలో ఉన్న గోవా మద్యం క్వార్టర్ బాటిళ్ల బాక్సులు లభించాయి. మొత్తం 120 బాక్సులలో 5,833 మద్యం బాటిళ్లు లభించాయి. పట్టుబడిన గోవా మద్యం బాటిళ్ల విలువ రూ.7 లక్షలు ఉంటుందని సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడిన ఈ మద్యం బాటిళ్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. కాగా పట్టుబడిన ఈ మద్యం ఎవరిదనేది విచారణ చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడిన గోవా మద్యం అధికార పార్టీకి చెందినదిగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

» మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తాపడ్డ వాహనం

హుకుంపేట, మే 7: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ సతీష్ మంళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. కోట్నాపల్లి పంచాయతీ కేంద్రంలోని బేస్ క్యాంపు నుంచి వస్తున్న బొలెరో వాహనం తాడిపుట్టు జంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ముగ్గురికి తీవ్రంగా గాయాలు తగలగా, నెల్లూరు జిల్లాకు చెందిన హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారి పవన్ (28) హుకుంపేట పీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అదే వాహనంలో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన బాబూరావు, డ్రైవర్ పి.సాయికృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


పది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మే 7: గొర్లివానిపాలెం పంచాయతీలోని జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీకి చెందిన గొలగాని గోవిందరాజు మంగళవారం రాత్రి పరవాడ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకు వెళ్తుండగా పట్టుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. అతని వద్ద గల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చంద్రబాబు రోడ్‌షో రేపు

» జగదాంబ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్, డాబాగార్డెన్స్ మీదుగా సీతంపేట వరకూ...

» అక్కడ రాత్రి 7.30 గంటలకు సభ.. సీతంపేటలో బహిరంగ సభ



విశాఖపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల తొమ్మిదో తేదీ సాయంత్రం నగరంలోని దక్షిణ, ఉత్తర నియోజక వర్గాల్లో రోడ్‌షో నిర్వహిస్తారని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ తెలిపారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు జగదాంబ జంక్షన్‌లో రోడ్‌షో మొదలవుతుందని, అక్కడ నుంచి పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి జంక్షన్, సరస్వతి పార్కు, డాబాగార్డెన్స్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సీతంపేట వరకు కొనసాగుతుందన్నారు. సీతంపేటలో రాత్రి 7.30 గంటలకు బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడతారన్నారు. కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు రోడ్ షోను, సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం



విజయనగరం జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం ఇక్కడకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న లోకేశ్‌కు ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, పార్టీ నేతలు కోరాడ రాజబాబు, గంటా రవితేజ, సీతంరాజు సుధాకర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో విజయనగరం బయలుదేరి వెళ్లారు.

-గోపాలపట్నం

సింహాద్రి ఎన్టీపీసీకి ప్లాటినం అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ హెచ్‌ఆర్ డీజీఎం సీమంత మహాపాత్ర

పరవాడ, మే 7: సింహాద్రి ఎన్టీపీసీకి 2023 సంవత్సరానికిగాను అపెక్స్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మకమైన ప్లాటినమ్ అవార్డును ప్రదానం చేసింది. సీఎస్ఆర్ విభాగంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఢిల్లీకి చెందిన అపెక్స్ ఇండియా ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎన్టీపీసీని ఎంపిక చేసింది. న్యూఢిల్లీలో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన ఎనిమిదో అపెక్స్ ఇండియా కాన్ఫరెన్స్ అవార్డుల ప్రధానోత్సవంలో ఫౌండేషన్ ప్రతినిధులు సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌ఆర్ విభాగం డీజీఎం సీమంత మహాపాత్రకు అవార్డును అందుకున్నారు.

పైడివాడ అగ్రహారంలో ఇద్దరు వలంటీర్ల తొలగింపు

సబ్బవరం, మే 7: మండలంలోని పైడివాడ అగ్రహారంలో వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు తెలిపారు. గ్రామంలో 6,7 క్లస్టర్లకు చెందిన వలంటీర్లు బొబ్బరి నరసింగరావు, నందవరపు గోవింద సోమవారం రాత్రి పీతపాలెంలో వైసీపీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తుండడంతో టీడీపీకి చెందిన అక్కిరెడ్డి దుర్గినాయుడు ఆర్‌వోకు, సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై తాము దర్యాప్తు చేసి వారిద్దరిని విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో రామ్మోహన్‌రావు తెలిపారు.

కరోనా సమయంలో ఎన్-95 మాస్కులు ఇవ్వలేదన్నందుకు దళిత డాక్టర్ సుధాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం వేధింపులు

నడిరోడ్డుపై కొట్టి, స్టేషన్‌లో నిర్బంధం

ప్రశ్నించడమే పాపమా!?

- మతిస్థిమితం లేనట్టు చిత్రీకరించి మానసిక వైద్యశాలకు తరలించారు
- ఏడాది తిరగకుండానే గుండెపోటుతో మృతి
- మూడేళ్లవుతున్నా అందని న్యాయం



నడి రోడ్డులో డాక్టర్ సుధాకర్ మెడపై లాఠీలు పెట్టి హింసిస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో ఎస్సీలకు చేదు అనుభవాలు అనేకం. ప్రభుత్వ లోపాలను ప్రశ్నిస్తే వేధించి వెంటాడడం పాలకులకు అలవాటుగా మారింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో డాక్టర్ సుధాకర్ కేసు కూడా అలాంటిదే. ఇది దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఘటన అయినా ఆ కుటుంబానికి ఇప్పటివరకూ న్యాయం జరగకపోవడం గమనార్హం. గౌరవప్రదమైన డాక్టర్ వృత్తిలో ఉన్న వ్యక్తిని నేషనల్ హైవేపై దుస్తులు లేకుండా నిలబెట్టి పోలీసులు లాఠీలతో కొట్టారు. మతి స్థిమితం లేని వ్యక్తిగా ముద్రవేసి మానసిక వైద్యశాలలో పడేశారు. కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడంతో ఆయనకు ఊరట లభించింది. ఆ తరువాత కూడా ఉద్యోగంలోకి తిరిగి తీసుకోకపోవడంతో మానసిక వేదనకు గురైన ఆయన ఏడాది తిరగకుండానే గుండెపోటుతో మరణించారు. మూడేళ్లు అవుతున్నా ఇంకా ఆ కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం అందలేదు. ఆయన ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కావడం వల్లే ఇలా చేశారని మిత్రులు వాపోతున్నారు.

ఇదీ కేసు నేపథ్యం

డాక్టర్ కె.సుధాకర్ (52) నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో అనస్థీషియన్‌గా పనిచేసేవారు. కరోనా సమయం (2020 ఏప్రిల్ 6వ తేదీ)లో ఆయన గ్లౌజులు, ఎన్-95 మాస్క్ కావాలని ఆస్పత్రిలో ఫార్మసిస్ట్‌ని అడిగారు. స్టాకు లేదని చెప్పడంతో డాక్టర్ అదే విషయాన్ని స్థానిక మీడియాకు తెలిపారు. రోగులకు చికిత్స చేసే వైద్యులకు కరోనా సమయంలో కనీసం మాస్కులు కూడా ఇవ్వకపోవడంపై ప్రశ్నించారు. ఇది సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సాధారణంగా అయితే వెంటనే అన్ని ఆస్పత్రులకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు సరఫరా చేయాలి. కానీ ఇక్కడ వైసీపీ పాలకులు రివర్స్‌లో వెళ్లారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేసినందుకు డాక్టర్ సుధాకర్‌ను ఏప్రిల్ ఎనిమిదో తేదీన సస్పెండ్ చేశారు. దాంతో ఆయన ఇది అన్యాయమని గొంతెత్తారు. తాను ఏ తప్పు చేయకున్నా సస్పెండ్ చేశారంటూ వాపోయారు. మాస్కులు అడగడం నేరమా?...అని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరుపై విమర్శలు వెల్లువెత్తడంతో డాక్టర్ సుధాకర్‌పై వైసీపీ పెద్దలు వ్యక్తిగతంగా కక్ష కట్టారు. విశాఖపట్నంలో నివాసం ఉండే ఆయన కదలికలపై నిఘా పెట్టారు. మరుసటి నెల మే 12వ తేదీన ఆయన కారులో పోర్టు ఆస్పత్రి నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళుతుండగా మఫ్టీలో ఉన్న పోలీసులు జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం వద్ద అడ్డగించారు. ఆయన కారు తాళాలు తీసుకున్నారు. ఆయన ప్రతిఘటించడంతో చొక్కా విప్పేసి, పెడరెక్కలు వెనక్కి విరిచి పట్టుకొని లాఠీలతో కొట్టారు. తన కారులో రూ.10 లక్షల నగదు, ఏటీఎం కార్డులు ఉన్నాయని, వాటిని పోలీసులు తీసుకొని ఇవ్వడం లేదని డాక్టర్ ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నడిరోడ్డుపై న్యూసెన్స్ చేస్తున్నారని ఆరోపించి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బంధువులు, మీడియా వెంటపడడంతో అక్కడ నుంచి రాత్రికి రాత్రి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ సరైన వైద్య పరీక్షలు నిర్వహించకుండానే మద్యం మత్తులో ఉన్నారని, మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నారని, ఆయన 'ఎక్యూట్ ట్రాన్సియంట్ సైకోసిస్'తో బాధపడుతున్నారని పేర్కొంటూ నగరంలోని మానసిక వైద్యశాలకు తరలించారు.

సంబంధం లేని చికిత్స

మానసిక వైద్యశాలకు తరలించడంతో డాక్టర్ సుధాకర్ కుంగిపోయారు. సంబంధం లేని మందులు తనకు ఇస్తున్నారని ఆరోపించారు. ఆ మందుల వల్ల తనకు దద్దుర్లు వచ్చాయని, కళ్లు సరిగ్గా కనిపించడం లేదని, తల తిప్పుతున్నట్టుగా ఉందని, వెంటనే తనను వేరే ఆస్పత్రికి మార్చాలంటూ సూపరింటెండెంట్‌కు లేఖ రాశారు. పైగా ఆస్పత్రిలో తనకు చికిత్స చేస్తున్న డాక్టర్ అధికార పార్టీకి చెందిన వ్యక్తి అంటూ ఆయన ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఎదుర్కొంటున్న కేసుల్లో ఏ-7గా ఉన్న వ్యక్తికి సదరు డాక్టర్ స్వయానా సోదరుడని, తనకు ప్రాణ హాని ఉందని, ప్రభుత్వ మానసిక వైద్యశాల నుంచి తరలించాలని వేడుకున్నారు. ఆయన లేఖ బయటకు రావడం, మీడియాలో వార్తా కథనాలు రావడంతో హైకోర్టు దీనిని సుమోటో కేసుగా స్వీకరించింది. డాక్టర్ సుధాకర్‌పై దాడి, తదుపరి పరిణామాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ కేసును సీబీఐ చేపట్టింది. వీటన్నింటి నేపథ్యంలో డాక్టర్ సుధాకర్‌ను ఇంటికి పంపించారు. అయితే ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయలేదు. ఆ కాలంలో సగం జీతం ఇవ్వాల్సి ఉండగా అది కూడా విడుదల చేయలేదు. ఆర్థిక కష్టాలు ఎక్కువయ్యాయి. తిరిగి తనను విధుల్లోకి తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉన్నానని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఎవరూ కనికరించలేదు. ఉద్యోగం పోయి, చేతిలో డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన 2021 మే 22న గుండెపోటుతో చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. డాక్టర్ సుధాకర్ తల్లి వద్దనే సీతమ్మధారలో అంతా కలిసి ఉంటున్నారు. తన కుమారుడికి జరిగిన అన్యాయంపై తల్లి కావేరిబాయి మాత్రమే పలుమార్లు మీడియా ముందుకు వచ్చి ఆవేదన వ్యక్తంచేశారు. భార్య, పిల్లలు మాత్రం భయపడి నోరు విప్పలేదు. జీవనాధారమైన ఆయన చనిపోయి మూడేళ్లు కావస్తున్నా ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం రాలేదని బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై డాక్టర్ కుటుంబాన్ని సంప్రతించగా, మాట్లాడేందుకు నిరాకరించారు. తాము అన్ని విధాలుగా నష్టపోయామని, ఏమి చెబుతామంటూ నిరాకరించారు.

ఓటరు మాట

వృద్ధులకు సౌకర్యాలు కల్పించాలి



సీనియర్ సిటిజన్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వారి ఇంటి నుంచి పోలింగ్ బూత్‌వరకు రవాణా సౌకర్యం కల్పించాలి. చాలా మంది షుగర్, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలతో పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూలైన్‌లో గంటల సేపు నిలిచి ఓటువేయలేరు. వారికి పూర్తి భద్రత కలిగిన రవాణాతో పాటు వెంటనే ఓటువేసే అవకాశం కల్పించాలి. దీనివల్ల ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి.

- డీవీఆర్ఎస్ శర్మ, పెందుర్తి

రాజకీయ వ్యాపారులు వద్దు



రాజకీయాలను వ్యాపారాలుగా మార్చుకునే నేతలకు ఎట్టి పరిస్థితిలో ఓటు వేయవద్దు. పార్టీ టికెట్లు కొనుగోలు, తాయిలాలు, ప్రలోభాలతో ఓటర్లను మభ్యపెట్టి గెలిచిన తరువాత రాష్ట్రాన్ని దోచుకుంటారు. సేవాభావంతో వచ్చిన వారిని గెలిపించుకుందాం. ఎన్నికలు దగ్గరపడిన తరుణంలో ఓటర్లు అభ్యర్థుల గుణగణాలు పరిశీలించి ఓటు వేయాలి.

- పెయ్యిల సిద్ధార్థ, మల్కాపురం

మహిళలూ ఆలోచించండి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి. ప్రతి జిల్లా కేంద్రంలో మహిళా యూనివర్సిటీని నెలకొల్పాలి. అత్యాచారాలు, వేధింపులు నియంత్రించాలి. ఆ దిశగా హామీ ఇచ్చే నేతలకే మహిళలంతా ఓటు వేయాలి. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా కృషి చేయాలి. మహిళా విద్యార్థులంతా ఇదే విధంగా ఆలోచించాలి.

- వేద వర్ష, గాజువాక

ఓటు వేయడం బాధ్యత



ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. 60, 70 శాతం ఓట్లతో కచ్చితమైన తీర్పురాదు. 90శాతానికి పైగా పోలింగ్ నమోదు కావాలి. ఓటర్లు చైతన్యం కావాలి. తనకు నచ్చిన పార్టీ, అభ్యర్థికి ఓటు వేసి తీర్పును వెల్లడించాలి. ప్రజాస్వామ్యవాదులు ముందుకు వచ్చి ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించాలి.

- సూర్యప్రకాశరావు, మధురవాడ

పారిశ్రామిక ప్రగతి అవసరం



రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి అవసరం. భారీ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుచేయాలి. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు, రాష్ట్రం ఆదాయం పెరుగుతాయి. పారిశ్రామిక ప్రగతిని కాంక్షించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. ఈ రంగం పట్ల అవగాహన, చిత్తశుద్ధి కలిగిన అభ్యర్థులకు ఓటు వేస్తే దేశానికి మేలు జరుగుతుంది.

- ములకలపల్లి పెంటయ్య, పెదగంట్యాడ

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243



ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అభ్యర్థులు రంగంలోకి దిగుతారు. కొంత మంది తమ ప్రత్యర్థులపై భారీ మెజారిటీతో విజయం సాధిస్తుంటారు. మరికొంతమంది స్వల్ప తేడాతో బయటపడతారు. కొన్ని నియోజకవర్గాల్లో పోటీ నువ్వా-నేనా అన్నట్టు సాగుతుంది. ఓట్ల లెక్కింపులో చివరి రౌండ్ వరకూ గెలుపు, ఓటములు దోబూచులాడుతుంటాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అత్యధిక, అత్యల్ప మెజారిటీతో గెలుపొందినవారి వివరాలు చూద్దాం...

అత్యధిక, అత్యల్ప మెజారిటీలు


ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 1983 ఎన్నికల్లో విశాఖపట్నం-2 నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఇ.వాసుదేవరావు తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి పల్లా సింహాచలంపై 47,916 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే ఇప్పటివరకూ రికార్డు. మళ్లీ గత ఎన్నికల్లో విశాఖ తూర్పు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెలగపూడి రామకృష్ణబాబు వైసీపీ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌పై 47,883 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు.

అత్యల్ప మెజారిటీ విషయానికి వస్తే 1985 ఎన్నికల్లో పాడేరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కొట్టగుళ్లి చిట్టినాయుడు...కాంగ్రెస్ పార్టీకి చెందిన మత్స్యరాస బాలరాజుపై కేవలం 113 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.



ఇ.వాసుదేవరావు

1983 ఎన్నికల్లో విశాఖపట్నం-2 నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి పల్లా సింహాచలంపై 47,916 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



వెలగపూడి రామకృష్ణబాబు

2014 ఎన్నికల్లో విశాఖ తూర్పు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి వైసీపీ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌పై 47,883 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

విజయనగరం జిల్లా 1978లో ఏర్పాటైంది. అప్పటివరకూ ఆ ప్రాంతం విశాఖపట్నం జిల్లాలో అంతర్భాగంగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం 1952లో మొదటి ఎన్నికలు జరిగాయి. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ ఉమ్మడి జిల్లాలో అత్యధిక, అత్యల్ప మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యేల వివరాలు....

- 1952 ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గం నుంచి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పీవీజీ రాజు, ప్రత్యర్థి జి.అప్పలస్వామిపై 36,460 ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలిచారు. ఇక భీమునిపట్నం నియోజకవర్గం నుంచి కె.సూర్యనారాయణ 889 ఓట్ల అతి స్వల్ప తేడాతో జేకేవీ రావుపై గెలిచారు.
- 1955లో గజపతినగరం నుంచి కుసుమ గజపతిరాజు (ప్రజా సోషలిస్టు పార్టీ)...జి.తిప్పేస్వామి (కాంగ్రెస్)పై 33,608 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అనకాపల్లి నియోజకవర్గం నుంచి భీశెట్టి అప్పారావు (కృషికార్ లోక్‌పార్టీ)...కె.గోవిందరావు (సీపీఐ)పై 680 ఓట్ల తేడాతో గెలిచారు.



బండారు సత్యనారాయణమూర్తి

1994 ఎన్నికల్లో పరవాడ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థిని ఈటి విజయలక్ష్మిపై 41,636 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.

- 1962లో విజయనగరం నుంచి భాట్టం శ్రీరామమూర్తి (కాంగ్రెస్)...వి.రామారావు(బీజేఎస్)పై 30,649 ఓట్ల ఆధిక్యంతో గెలవగా, బొద్దాం నుంచి అల్లు దశావతారం (కాంగ్రెస్) జీబీ అప్పారావు (స్వతంత్ర పార్టీ)పై కేవలం 214 ఓట్ల తేడాతో గెలిచారు.
- 1967లో మాడుగుల నుంచి రమాకుమారిదేవి (కాంగ్రెస్)...ఎస్.భూమిరెడ్డి (ఇండి)పై 20,231 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందగా, విశాఖ-2 నుంచి పోతిన సన్యాసిరావు (సీపీఎం) పీఎంనాయుడు (కాంగ్రెస్)పై 1,078 ఓట్ల తేడాతో విజయం సాధించారు.
- 1972లో విజయనగరం నుంచి అప్పసాని అప్పన్నదొర (కాంగ్రెస్)...భారతీయ జనసంఘ్ అభ్యర్థి ఎ.ప్రకాశరావుపై 24,902 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. విశాఖ-2 నుంచి పోతిన సన్యాసిరావు (ఇండిపెండెంట్)...ద్రోణంరాజు సత్యనారాయణ (ఇండిపెండెంట్)పై 1,492 ఓట్ల తేడాతో గెలిచారు.
- 1978లో విజయనగరం నుంచి పి.అశోకగజపతిరాజు (జనత)...అప్పలస్వామి (కాంగ్రెస్)పై 26,090 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. మాడుగుల నుంచి కురచా రామునాయుడు(ఇండిపెండెంట్)...బి.ఆదినారాయణ(కాంగెస్-ఐ)పై 410 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అదే ఏడాది విజయనగరం జిల్లా ఏర్పడింది.
- 1983లో విశాఖ-2 నుంచి ఇ.వాసుదేవరావు (టీడీపీ), పల్లా సింహాచలం (కాంగ్రెస్)పై 47,916 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలిచారు. జిల్లాలో ఇంతవరకూ అదే అత్యధిక మెజారిటీ. నర్సీపట్నం నుంచి అయ్యన్నపాత్రుడు (టీడీపీ)...రాజాసాగిరామచంద్రరాజు (కాంగ్రెస్)పై 992 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- 1985లో పరవాడ నుంచి పైలా అప్పలనాయుడు (టీడీపీ)...కేఎస్ఏ రామయ్యనాయుడు(కాంగ్రెస్)పై 33,226 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. పాడేరు నుంచి కొట్టగుళ్లి చిట్టినాయుడు (టీడీపీ)...మత్స్యరాస బాలరాజు (కాంగ్రెస్)పై 113 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలిచారు. జిల్లా ఎన్నికల చరిత్రలో ఇప్పటివరకు ఇదే అత్యల్ప మెజారిటీ.
- 1989లో భీమునిపట్నం నుంచి ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు (టీడీపీ)...కేవీవీ సూర్యనారాయణరాజు (కాంగ్రెస్)పై 31,814 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. చింతపల్లి నుంచి పి.బాలరాజు (కాంగ్రెస్)...కొర్రు మల్లయ్య (సీపీఐ)పై 1,999 ఓట్ల మెజారిటీతో గెలిచారు.
- 1994లో పరవాడ నుంచి బండారు సత్యనారాయణమూర్తి (టీడీపీ)...ఈటి విజయలక్ష్మి (కాంగ్రెస్)పై 41,636 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అనకాపల్లి నుంచి దాడి వీరభద్రరావు (టీడీపీ)...దంతులూరి దిలీప్‌కుమార్ (ఇండిపెండెంట్)పై 1,611 ఓట్ల తేడాతో గెలిచారు.



ఎస్.రంగరాజు

2004లో విశాఖ-2 నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి పల్లా సింహాచలంపై 46,075 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.

- 1999లో విశాఖ-2 నుంచి పిన్నింటి వరలక్ష్మి (టీడీపీ)...వై.మరియదాస్ (కాంగ్రెస్)పై 30,637 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అనకాపల్లి నుంచి దాడి వీరభద్రరావు (టీడీపీ)...కొణతాల రామకృష్ణ(కాంగ్రెస్)పై 3,711 ఓట్ల తేడాతో గెలిచారు.
- 2004లో విశాఖ-2 నుంచి ఎస్.రంగరాజు (కాంగ్రెస్), పల్లా సింహాచలం (టీడీపీ)పై 46,075 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. భీమునిపట్నం నుంచి కర్రి సీతారామ్ (కాంగ్రెస్)...అప్పలనరసింహరాజు (టీడీపీ)పై 233 ఓట్ల తేడాతో గెలిచారు.
- 2009 ఎన్నికల్లో గాజువాక నుంచి ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసిన చింతలపూడి వెంకట్రామయ్య 17,907 ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డిపై గెలుపొందారు. విశాఖ దక్షిణం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాసరావు 341 ఓట్ల తేడాతో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి కోలా గురువులుపై గెలిచారు.



కొట్టగుళ్ల చిట్టినాయుడు

1985లో పాడేరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మత్స్యరాస బాలరాజుపై 113 ఓట్ల అతి స్వల్ప తేడాతో గెలిచారు.

- 2014 ఎన్నికల్లో విశాఖ తూర్పు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెలగపూడి రామకృష్ణబాబు 47,883 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌పై విజయం సాధించారు. చోడవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కేఎస్ఎన్ఎస్ రాజు 917 ఓట్ల తేడాతో వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీపై గెలుపొందారు.
- 2019 ఎన్నికల్లో పాడేరు నుంచి వైసీపీ అభ్యర్థినిగా పోటీ చేసిన కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తన ప్రత్యర్థి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని గిడ్డి ఈశ్వరిపై 40,930 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు...వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై 1,870 ఓట్లతో విజయం సాధించారు.

● చోడవరం

ఎన్నికల వేళ ఉపాధి మేళా



- ప్రచారానికి వెళితే రోజుకూ రూ.300 నుంచి రూ.500
- మధ్యాహ్నం, రాత్రి భోజనం

ఎన్నికలు వేళ ప్రచారం పర్వం... రెక్కాడితేగానీ డొక్కాడని పేదలకు కడుపు నింపుతోంది. కండువా కప్పుకొని నేతలను అనుసరిస్తూ రోజంతా తిరిగితే గ్రామీణ ప్రాంతంలో రోజుకు రూ.300 నుంచి 500 వరకూ ఇస్తున్నారు. కూలీతోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం కూడా ఏర్పాటు చేస్తున్నారు. రాత్రికి క్వార్టర్ మందుకు డబ్బులు ఇస్తున్నారని కూలీలు పేర్కొటున్నారు. ఎన్నికల వేళ తమ చేతిలో డబ్బులు కనడుతున్నాయని, కడుపునిండా తినగలుగుతున్నామని సంబరపడుతున్నారు. అదే కూలీ పనికి వెళితే రోజంతా కష్టం చేయాల్సివస్తుందని, దీంతో ఒళ్లంతా హూనమైపోతుందని ఇక్కడ మాత్రం అయితే కండువా కప్పుకోవడం లేదంటే జెండా పట్టుకోవడమేనని అంటున్నారు.

వ్యవసాయానికి కూలీలు, షాపులో వర్కర్లు కరువు

గ్రామీణ ప్రాంతాల్లో పలువురు వ్యవసాయ కూలీలు, పట్టణ ప్రాంతాల్లో దుకాణాల్లో పనిచేసే వర్కర్లు పార్టీల ప్రచారానికి వెళుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలతో వ్యవసాయానికి కూలీలు కరువవుతున్న పరిస్థితి. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో వర్కర్లు దుకాణాలకు రావడం మానేశారని పలువురు యజమానులు పేర్కొంటున్నారు. దుకాణాల్లో పని, సీనియారిటీని బట్టి నెలకు 4,000 నుంచి రూ.10 వేలు వరకు ఇస్తున్నారని, అదే ఎన్నికల ప్రచారానికి వెళితే రోజుకు రూ.500 ఇవ్వడంతోపాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారని వర్కర్లు చెబుతున్నారు. దీంతో తమ యాజమానుల దగ్గర అనుమతి తీసుకొని మరి గత కొన్ని రోజులుగా తాము ప్రచారానికి వెలుతున్నామని కొంతమంది పేర్కొంటున్నారు. దుకాణాల్లో నెల జీతం కంటే రెండింతలు ఎక్కువ ఆదాయం వస్తుందంటున్నారు.

● కోటవురట్ల

మీకు తెలుసా!?

కరపత్రాలతోనే ప్రచారం!



1937 నాటి బ్రిటిష్ హయాంలో ఎన్నికల ప్రచార కరపత్రం

ఈ కరపత్రాన్ని చూశారా... 1937లో మద్రాసు శాసన నిర్మాణ సభకు ఎన్నికలు నిర్వహించే సమయంలో విజయనగరం మహారాజా పూసపాటి అలకనారాయణ గజపతిరాజు తరఫున ఇనాందారులు కట్టోజు పెద్ద గంగరాజు, జి.వీర్రాజునాయుడు ముద్రించిన ప్రచార పత్రమిది. సంస్థానాధీశుడు శాసన సభకు పోటీ చేస్తున్నందున అందరూ ఓటువేసి గెలిపించుకోవాలని అభ్యర్థించడంతో పాటు, ఆయన గుణగణాలను ప్రస్తుతిస్తూ ప్రచురించారు. అంతేకాకుండా రెండు స్థానాలకు జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి రెండు ఓట్లను నీలిరంగులో ఉన్న పెట్టెలో వేయాలని ఇందులో సూచించారు. అప్పట్లో ప్రచార హోరు ఉండేది కాదు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ఓటర్లకు అందించేవారు. వారు దానిని చదువుకుని ఓటు వేసేవారు. కరపత్రాలు ముద్రించడానికి కూడా డబ్బులు లేని అభ్యర్థులు నోటి మాట ద్వారా ప్రచారం చేసేవారు. బ్రిటిష్ హయాంలో శాసన నిర్మాణ సభలకు పలు దఫాలు ఎన్నికలు నిర్వహించినప్పటికీ, తమకు అనుకూలమైన అభ్యర్థులను వారే ఎంపిక చేసేవారు. అప్పట్లో విజయనగరం విశాఖ జిల్లాలోనే ఉండేది.

● భీమునిపట్నం రూరల్

ప్రచార సిత్రం



ఎన్నికల ప్రచారంలో భాగంగా విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజస్విని జీవీఎంసీ 29వ వార్డులో ఇలా మిషన్ కుట్టారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

▸▸ జనసేన ఎన్నికల పరిశీలకులు పడాల అరుణ


మాట్లాడుతున్న పడాల అరుణ

కొత్తూరు, మే 7: కూటమి అభ్యర్థుల విజయానికి జిల్లా ప్రజలంతా సహకరించాలని జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పడాల అరుణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ.. కొణతాల రామకృష్ణ రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉందని, అటువంటి వ్యక్తిని గెలిపిస్తే అనకాపల్లి ప్రాంతం ఒక్కటే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.

మార్టూరులో వైసీపీకి ఎదురు దెబ్బ

▸▸ జనసేనలో చేరిన హరిబాబు


జనసేనలో చేసిన హరిబాబు

అచ్యుతాపురం, మే 7: మండలంలోని మార్టూరులో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామంలో రాజుల సామాజిక వర్గానికి చెందిన హరిబాబు తన అనుచరులతో మంగళవారం జనసేనలో చేరారు. అచ్యుతాపురం పార్టీ కార్యాలయంలో చేరిన హరిబాబుకు జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాపూజీ, తుమ్మలరాజు, డీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి శత వర్ధంతి

రాంబిల్లి, మే 7 : మండల కేంద్రలో మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి శత వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. నారాయణరావు, పలువురు యువకులు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రాము, అల్లూరి ప్రజా సంఘాల అభివృద్ధి వేదిక అధ్యక్షుడు భూపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండుగ


మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కొత్తూరు, మే 7 : మేజర్ పంచాయతీ కొత్తూరులో మోదకొండమ్మ పండుగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామున నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉత్సవ కమిటీ ప్రతినిధులు బర్ల నాగరాజు, మొల్లి నాగ అప్పారావు, సత్తిబాబు, అశోక్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి జోరుగా ప్రచారం


సబ్బవరంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

సబ్బవరం, మే 7 : మండలంలోని పలు గ్రామాల్లో కూటమి విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం సబ్బవరంతో పాటు ఇరువాడ, అసకపల్లి, పైడివాడ, పైడివాడ అగ్రహారం, బంగారమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, టెక్కలిపాలెం, వంగలి, ఆర్సీఅగ్రహారం, అమృతపురం, మొగలిపురం, మలునాయుడుపాలెం, గుల్లేపల్లి తదితర గ్రామాల్లో కూటమి కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి రమేశ్‌బాబుకు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోన సోమేశ్వరరావు, బర్ల రమణ, గెడ్డం రమేశ్, పెద్దాడ రమణమ్మ, శ్రావణి పాల్గొన్నారు.

కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ కరపత్రాలు


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

కొత్తూరు, మే 7 : బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు ఎన్డీఏ కూటమికి మద్దతుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సీఎం రమేశ్ తనయుడు సీఎం రిత్విక్ తదితరులు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు ఎన్డీఏ కూటమికి ప్రకటించడం అభినందనీయమన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కొండబాబు, ఎమ్మార్పీ ఎస్ సీనియర్ నాయకుడు కల్లి చిన్న అప్పారావు, కాకినాడ కనకేశ్వరరావు, గంపల చినరాజు, ఎంఎస్‌పీ నేత కట్టమూరు మంగరాజు పాల్గొన్నారు.

జనం జంప్

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేయడంతోపాటు వలంటీర్ ద్వారా ప్రజల వద్దకే పథకాలను పంపిస్తున్నామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని...అంటూ ప్రసంగం ఆసాంతం తన గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమయ్యారు

ఎమ్మెల్యే నాగిరెడ్డి పేరెత్తని ముఖ్యమంత్రి

గాజువాకలో మంగళవారం జరిగిన సభలో స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేరును ముఖ్యమంత్రి జగన్ ఎక్కడా ప్రస్తావించకుండానే సభను ముగించేశారు. ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ కూడా నాగిరెడ్డి పేరు ప్రస్తావించలేదు. ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థినీ ఇద్దరూ కనీసం మాటమాత్రంగానైనా ఎమ్మెల్యే నాగిరెడ్డి పేరు ప్రస్తావించకపోవడం వైసీపీ నేతల్లో చర్చనీయాంశమైంది. గాజువాక వచ్చిన సీఎం జగన్ కనీసం టికెట్ ఇవ్వకుండా పక్కనపెట్టేశాననే సానుభూతితోనైనా ఎమ్మెల్యే పేరు ప్రస్తావించాలని, అలా చేయకపోవడం తమకు బాధ కలిగించిందంటూ నాగిరెడ్డి అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

వర్షంతో ఉపశమనం


కోటవురట్లలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి టౌన్, మే 7 : పట్టణంలో మంగళవారం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. ఉదయం ఏడు గంటల సమయంలో వర్షం కురిసింది. వర్షపాతం 27.5 ఎంఎంగా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షంతో రోడ్లన్నీ తడిసి ముద్దవ్వడంతో పాటు ఒక్కసారిగా చల్లదనం చోటుచేసుకోవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. గత కొద్ది రోజుల నుంచి 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో ప్రజలు చల్లగాలికి నోచుకోలేదు. అయితే మంగళవారం ఉదయం వర్షం పడటంతో పాటు రాత్రి అయినా వాతావరణమంతా చల్లగా ఉండడంతో పిల్లలు, వృద్ధులు కూడా ఉపశమనం పొందారు.

పాయకరావుపేటలో.. పట్టణంలో మంగళవారం ఉదయం తేలికపాటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. ప్రస్తుత ఎండాకాలంలో పాయకరావుపేటలో రోజూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వడగాడ్పులు, ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కోటవురట్లలో.. మండలంలో ఉరుముల మెరుపులతో మంగళవారం ఉదయం పలు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. రామచంద్రపాలెం, పందూరు, గొట్టివాడ, కైలాసపట్నం, కోటవురట్ల, తంగేడు, తదితరగ్రామాల్లో వర్షం కురడంతో వాతావరణం చల్లబడింది. నెల రోజుల నుంచి తీవ్ర వడగాడ్పులకు ఉక్కిరిబిక్కరైన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

రాష్ట్రంలో ఎన్‌డీఏ గాలి

▸▸ నెల రోజుల్లో కొత్త ప్రభుత్వం

▸▸ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత



కూలీలతో మాట్లాడుతున్న వంగలపూడి అనిత


వృద్ధురాలిని ఆలింగనం చేసుకుంటున్న అనిత

నక్కపల్లి, మే 7: రాష్ట్రంలో రోజురోజుకూ ఎన్‌డీఏ కూటమికి ఆదరణ పెరుగుతోందని, ఎన్‌డీఏ గాలి వీస్తోందని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెదదొడ్డిగల్లు ,పెదబోదిగల్లం ముస్లిం గ్రామాలతో పాటు, గుల్లిపాడు, ముకుందరాజుపేట, దోసలపాడు అగ్రహారం గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. మరో నెల రోజుల్లో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల చల్లని ఆశీస్సులతో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అనుకూలంగా మారిందన్నారు. ప్రజలు కూడా జగన్ నిజరూపాన్ని గుర్తించారని, మరో ఐదు రోజుల్లో జగన్ సర్కారను ఇంటికి పంపేందుకు ఆత్రంగా ఎదురుచూస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే ఎన్‌డీఏ ప్రభుత్వం నెల రోజుల్లో ఏర్పడుతుందని చెప్పారు. ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రజల కష్టాలను ఆమె తెలుసుకున్నారు. పలువురు కూలీలు,చేతివృత్తుల వారితో మాట్లాడారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. ఈవీఎంలో తన పేరు, సైకిల్ గుర్తు మొదటి వరుసలో వుంటుందని, సైకిల్‌పై ఓటేసి గెలిపించాలని, కమలం గుర్తుపై ఓటేసి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. ఆమె వెంట బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నేతలు

ఎలమంచిలి, మే 7: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన వెంకటరమణతో పాటు పలు గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు జనసేన పార్టీలో చేరారు. వీరందరికి సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల గెలుపునకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.


సుందరపు సమక్షంలో వైసీపీ నుంచి జనసేనలో చేరిన నేతలు, కార్యకర్తలు


ప్రచారం చేస్తున్న సందరపు సతీమణి శైలజ, కుటుంబ సభ్యులు

సుందరపునకు మద్దతుగా ప్రచారం

ఎలమంచిలి పట్టణంలో మంగళవారం జనసేన సెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులతో పాటు బుల్లితెర నటీమణులు ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ తులసీనగర్,, ఎన్టీఆర్ కాలనీ, వినాయకుడి ఆలయం తదితర ప్రాంతాల్లో ఇంటింట ప్రచారాన్ని చేపట్టారు. సుందరపు విజయకుమార్ సతీమణి శైలజ, ఆయన వదిన దయమంతి, మరదలు నందిని తమదైన శైలిలో ప్రచారం చేశారు. అదే విధంగా బుల్లితెర నటీమణులు పూజామూర్తి, సహస్రనాయుడు, హసీనా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నేతలు ఆదిమూర్తి, గంధం శివ, సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడండి

▸▸ జనసేన పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, మే 7: ఐదేళ్ల వైసీపీ పాలనకు వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా చరమగీతం పాడాలని జనసేన పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం, ఎస్సీ కాలనీ, రావాడ, వెన్నెలపాలెంల్లోని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్లకు అడుగడుగునా మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందన్నారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ఈ ప్రచారంలో దేశపాత్రునిపాలెం శివారు ఎస్సీ కాలనీకి చెందిన పలువురు మహిళలు వైసీపీ నుంచి జనసేనలోకి చేరారు. జనసేన పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మహిళలతో పాటు నడుపూరి రమణ జనసేనలో చేరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, టీడీపీ నేతలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, వియ్యపు చిన్న, పిల్లా శివకుమార్, మోటూరి సన్యాసినాయుడు, మచ్చ శివకుమార్, కన్నూరి వెంకటరమణ, కన్నూరి దేవి, జనసేన నాయకులు అమరపిన్ని జోగినాయుడు, బొండా లీలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నుంచి జనసేనలో చేరిన మహిళలతో పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

యాత, శెట్టిబలిజలకు సముచిత స్థానం

సబ్బవరం: కూటమి ప్రభుత్వంలో యాత, శెట్టిబలిజలకు సముచిత స్థానం ఉంటుందని జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని గొటివాడలో మంగళవారం పెందుర్తి నియోజకవర్గం యాత, శెట్టిబలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పంచకర్ల వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కూటమి విజయానికి అంతా పనిచేయాలని కోరారు. గాజుగ్లాసు గుర్తుపై తనకు, కమలం గుర్తుపై సీఎం రమేశ్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు ఆయన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వడిసల రమేశ్, కాకర నానాజీ, అంగటి నానీ, టి. శేఖర్, గండి వంశీదీప్, బాబూరావు, వెంకటేశ్వరరావు, సత్యారావు, దొడ్డి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

▸▸ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించిన సుందరపు


పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసిన అనంతరం వేలి చుక్క చూపుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఎలమంచిలి, మే 7: ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం రెండో రోజు పోస్టల్ బ్యాలెట్‌ను పలు శాఖల ఉద్యోగులు వినియోగించుకున్నారు. ఐసీడీఎస్ ఉద్యోగులు మరింత ఉత్సాహంతో తమ ఓటును వినియోగించుకున్నారు. ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందపు విజయకుమార్ సందర్శించారు. ఈ కేంద్రంలోని పోలింగ్ సరళిని స్వయంగా పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ పేపరు మీద స్టాంప్ వేయలేదని చాలా మంది తమ దృష్టికి తీసుకురావడంతో ఆర్వో దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని విజయకుమార్ అన్నారు. వేసిన ఏ ఓటు ఇన్‌వ్యాలిడ్ అవ్వకూడదని, అందుకు అధికారులు మరోసారి పరిశీలన చేయాలని సూచించామన్నారు. ఆయన వెంట నేతలు పిట్టా శ్రీను, బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, కొలుకులూరి విజయ్‌బాబు, కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ ఉన్నారు.

జగన్మోహనరెడ్డిని ఓడించాలి

▸▸ ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవరావు



విలేకర్లతో మాట్లాడుతున్న దాసరి చెన్నకేశవరావు

పాయకరావుపేట, మే 7 : రాష్ట్రంలో 64 వేల టీచర్ల పోస్టులను భర్తీ చేస్తానని నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన జగన్మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడ ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్న పరవాడ రామకృష్ణకు మద్దతుగా పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని చేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవరావు మాట్లాడుతూ ప్రతీ జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి .. అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను జగన్ మోసం చేశారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.72వేల కోట్లను దారి మళ్లించారని ఆరోపించారు. ప్రజలు జగన్ మోసాలను గుర్తించి ఈ ఎన్నికల్లో ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా జగన్ హఠావో పేరిట రాష్ట్రంలో జైత్ర యాత్ర చేస్తున్నామని తెలిపారు. పాయకరావుపేట ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న స్థానికుడు పరవాడ రామకృష్ణకు ఓట్లేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రచారకర్త బంధం బాలమురళీకృష్ణ, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర నాయకులు జాలరావు, నాగరాజు, మూర్తి, పరవాడ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నమూనా బ్యాలెట్‌తో ఇంటింటి ప్రచారం

పాయకరావుపేట/రూరల్, మే 7 : ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరపున పోటీచేస్తున్న టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర తదితరులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పట్టణంలోని బృందావనం తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల నమూనా బ్యాలెట్‌తో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, గుల్లా నాగరాజు, దాసరి శ్రీనివాస్, బంగారు లక్ష్మణరావు, మహేష్, సురేష్, రత్నకుమార్, అర్జున, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

సత్యవరంలో...

మండలంలోని సత్యవరంలో మంగళవారం స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు, జనసేన మండల అధ్యక్షుడు ఎగదాసు నానాజీ తదితరులు ఇంటింటికి వెళ్లి నమూనా బ్యాలెట్‌తో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జూరి నారాయణరావు, కీర్తి సీతారాం, గొల్లపల్లి నాగు, బొలిశెట్టి నాగేశ్వరరావు, సకిలేటి నాగేశ్వరరావు, జనసేన నాయకులు పంపా రామచంద్రరావు, కీర్తి వీరబాబు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

కూటమికి మద్దతుగా జానీ మాస్టర్ ప్రచారం


నేవీ కాలనీలో ఎన్నిల ప్రచారం చేస్తున్న జానీ మాస్టర్

రాంబిల్లి, మే 7 : మండలంలోని నేవీ కాలనీ, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో మంగళవారం ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాస్, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయనతోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, ఎంపీటీసీ మాజీ సభ్యులు చెల్లూరి దేముడు, కూటమి నేతలు ఉరిటి నానాజీ, గబ్బర్‌సింగ్, ఉమ్మిడి నాగేష్, చోడిపిల్లి ప్రసాద్, నాని, పప్పల గోవింద్ పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమికి విశ్వబ్రాహ్మణుల మద్దతు


అనితను కలిసి మద్దతు తెలుపుతున్న విశ్వబ్రాహ్మణుల సంఘ నేతలు

పాయకరావుపేట, మే 7 : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు తమ మద్దతు తెలియజేస్తున్నామని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మత్తుర్తి గంగారావు, ప్రధాన కార్యదర్శి చేబోలు సూరిబాబు ప్రకటించారు. టీడీపీ, జేసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోలో విశ్వబ్రాహ్మణ బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సందర్భంగా జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితను కలిసి కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోటిపల్లి జేజిబాబు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి మత్తుర్తి మహేష్, నాయకులు పెదపాటి శరత్, పెదపూడి నరసింహమూర్తి, కోసూరి శ్రీనివాసరావు, తంగేటి శివాజి పాల్గొన్నారు.

బెల్లం, చిరుధాన్యాల జోడింపు ఉత్పత్తుల తయారీపై శిక్షణ అభినందనీయం

▸▸ నాబార్డు డీడీఎం జి. సమంత్‌కుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాబార్డు డీడీఎం జి. సమంత్‌కుమార్

సబ్బవరం, మే 7 : మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో జాగృతి సొసైటీ బెల్లం, చిరుధాన్యాల జోడింపు ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని నాబార్డు డీడీఎం జి.సమంత్‌కుమార్ అన్నారు. నాబార్డు సహకారంతో మహిళలకు ఏప్రిల్ 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీడీఎం సమంత్‌కుమార్, అల్లూరి జిల్లా డీడీఎం రావూరి చక్రధర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాగృతి ఎండీ కందర్ప సుజాత మాట్లాడుతూ.. 60 మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపుల మహిళలకు 30 రకాల ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎఆర్ఎస్ ఆడిటర్ వీవీకే జగన్నాథరావు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్'పై ప్రకటన చేయకపోవడం అన్యాయం

పరవాడ, మే 7 : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రధానమంత్రి మోదీ అనకాపల్లిలో జరిగిన బహిరంగ సభలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామం తరలింపు, ఎన్టీపీసీ కాలుష్యంతో అల్లాడిపోతున్న మూలస్వయంభూవరం, సోమునాయుడుపాలెం గ్రామాల తరలింపుపై ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు.సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు ఆర్‌ఆర్ నాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అల్లు రాజు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సభ్యులను కలిసిన సుందరపు


బార్ అసోసియేషన్ సభ్యులను కలిసిన సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, మే 7: స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులను జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ మంగళవారం కలిశారు. కూటమి అభ్యర్థుల విజయానికి తమ వంతు ప్రోత్సాహం అందించాలని కోరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కు కమలం గుర్తుపైన, తనకు గాజుగ్లాస్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పిట్టా శ్రీను, బొద్దపు శ్రీను, కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి జాతర

ఎస్. రాయవరం, మే 7: గంధం అమావాస్య వేడుకలను పురస్కరించుకొని మండలంలోని పేటసూదిపురంలో మంగళవారం నూకాంబిక అమ్మవారి జాతరను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పసుపు , కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నేత కరణం శివ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించాలని ప్రధానికి వినతి


కొత్తూరు, మే 7 : జిల్లాలో మూతపడిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ చక్కెర కర్మాగారాలు తెరిపించి, ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు ప్రధాని నరేంద్రమోదీని కోరారు. సోమవారం ఉగ్గినపాలెంలో జరిగిన ప్రజాగళం కార్యక్రమానికి వచ్చిన ఆయనకు స్వాగతం పలికి కర్మాగారాల విషయమై వినతిపత్రం అందజేసినట్టు జగదీష్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం

అనకాపల్లి టౌన్, మే 7 : పట్టణంలోని పూడిమడక రోడ్డు, పెదరెల్లివీధి ప్రాంతాల్లో మంగళవారం కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి ఐఆర్ గంగాధర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఓటమి భయంతో పక్క జిల్లాకు వెళ్లిపోయారని విమర్శించారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు దాసరి సంతోష్, కొల్లి సత్యారావు, విజయ్‌కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సీపట్నం ఆర్‌వోపై చర్యలు తీసుకోవాలి

- పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ ప్రక్రియ తీరు అవమానకరం
- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

విశాఖపట్నం, మే 7 : నర్సీపట్నం ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాంపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్న పాత్రుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్‌ల ఓటింగ్‌లో ఆర్‌వో వ్యవహరించిన ప్రజా స్వామ్యానికే అవమానకరంగా ఉందని, ఓటింగ్ ఏజెంట్లకు ఇచ్చే పత్రాలపై ఆర్‌ఓ సంతకాలు లేకుండా ఇచ్చారన్నారు. ఈ విషయం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మీనాకు ఫిర్యాదు చేయగా, వెం టనే ఆయన స్పందించి ఆర్‌వోను మందలించినట్టు చెప్పారు. అలాగే, ఆర్‌వో ముఖ్యమంత్రి జగన్‌కు భయపడుతున్నారా... లేక అమ్ముడు పోయారో... అర్థం కావడంలేదని ఆరోపించారు. వైసీపీనుంచి తనకు ఆఫర్ వచ్చిందని, తనను ఎన్నికల్లో తామే డబ్బుఖర్చు చేసి గెలిపిస్తామని ఆహ్వానించారన్నారు. తన రక్తంలో టీడీపీ తప్ప మరో పార్టీకి చోటులేదని, అందుకే వైసీపీ ఇచ్చిన అవకాశాన్ని తిరస్కరించినట్టు అయ్యన్నపాత్రుడు స్పష్టంచేశారు. తనకు రాజకీయంగా జన్మనిచ్చిన తెలుగుదేశం పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. వైనాట్ 175 అన్న జగన్ స్వరం.. నేడు ఎందుకు హీనంగా మా రిందని ప్రశ్నించారు. ఆయనకు ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. వైసీపీకి సమాధి కట్టాలని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారన్నారు. ఉద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా ఓటువేస్తున్నా, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ మాత్రం సక్రమంగా నిర్వహించడంలేదని ఆరోపించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియనిర్వహణలో నర్సీపట్నం ఆర్‌వో వ్యవహరిస్తున్న తీరు సక్రమంగా లే నందున వెంటనే ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ప్రమాదకరంగా మారిందని, ప్రజల ఆస్తులకు రక్షణ కరువైందన్నారు. ఈస్థితి లో త్వరలో జరగనున్న ఎన్నికలలో ఆలోచించి ఓటు వేసి జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



నర్సీపట్నంలో బ్యాలెట్ ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు

నర్సీపట్నం అర్బన్, మే 7 : పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రెండో రోజు నర్సీపట్నంలో ప్రశాంతంగా సాగింది. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాలకు చెందిన ఒకటి, ఇతర జిల్లాల ఓటర్లకు ఒకటి, వైద్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు ఒకటి చొప్పున ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు మొత్తం 2,329 పోస్టల్ ఓట్లుకాగా, 90శాతం పోలింగ్ జరిగినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ. జయరాం తెలిపారు పోలింగ్ సరళిని ఎన్నికల అబ్జర్వేటర్ దర్శిత్ సింగ్ పరిశీలించారు.

చోడవరంలో...

చోడవరం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రెండో రోజు కూడా ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోలింగ్ బుధవారంతో ముగియనుంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీలు, ఇతర ప్రాంతాల నుంచి ఎన్నికల విధుల కోసం వచ్చిన వారికి స్థానికంగా ఆరు బూత్‌లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

మాడుగులలో...

మాడుగుల : నియోజకవర్గ కేంద్రం మాడుగులలోని ఆర్‌సీఎం పాఠశాల పోలింగ్ కేంద్రంలో మంగళవారం 1120 ఓట్లు పోలయ్యాయని ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రాజా తెలిపారు. మొత్తం 2,465 ఓట్లకు గాను తొలిరోజు 735 ఓట్లు పోలవ్వగా, రెండవ రోజు 1120 మంది ఓట్లు వేసినట్టు చెప్పారు. కాగా ఉదయం కురిసిన వర్షం కారణంగా ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ పావు గంట ఆలస్యంగా ప్రారంభమైంది. పోలీసు బలగాల నడుమ పోలింగ్‌ను జరిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణి, పోలింగ్ నోడల్ అధికారిణి ఈశ్వరమ్మ, తహసీల్దార్ టి.సత్యనారారాయణ ఏర్పాట్లు చేపట్టారు.


చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

విప్లవ వీరుడు అల్లూరికి పలువురు నివాళి


మాకవరపాలెం మండలం తామరం.., రోలుగుంట మండలం కుసర్లపూడిలో నివాళి

మాకవరపాలెం, మే 7 : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని మండలంలోని తామరం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

గొలుగొండ : అల్లూరి వర్ధంతి సందర్భంగా చీడిగుమ్మలలో గల ఆయన విగ్రహానికి జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, సీపీఐ జిల్లా నాయకుడు మాకిరెడ్డి రామునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోలుగుంట : కుసర్లపూడిలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. సర్పంచ్ మద్దు అప్పలనాయుడు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గొల్లు రాజుబాబు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

జనం జంప్

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేయడంతోపాటు వలంటీర్ ద్వారా ప్రజల వద్దకే పథకాలను పంపిస్తున్నామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని..అంటూ ప్రసంగం ఆసాంతం తన గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమయ్యారు

ఎమ్మెల్యే నాగిరెడ్డి పేరెత్తని ముఖ్యమంత్రి

గాజువాకలో మంగళవారం జరిగిన సభలో స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేరును ముఖ్యమంత్రి జగన్ ఎక్కడా ప్రస్తావించకుండానే సభను ముగించేశారు. ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ కూడా నాగిరెడ్డి పేరు ప్రస్తావించలేదు. ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థినీ ఇద్దరూ కనీసం మాటమాత్రంగానైనా ఎమ్మెల్యే నాగిరెడ్డి పేరు ప్రస్తావించకపోవడం వైసీపీ నేతల్లో చర్చనీయాంశమైంది. గాజువాక వచ్చిన సీఎం జగన్ కనీసం టికెట్ ఇవ్వకుండా పక్కనపెట్టేశాననే సానుభూతితోనైనా ఎమ్మెల్యే పేరు ప్రస్తావించాలని, అలా చేయకపోవడం తమకు బాధ కలిగించిందంటూ నాగిరెడ్డి అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు.


వర్షపు నీరు చేరడంతో చెరువులా మారిన కృష్ణాదేవిపేట బస్ స్టేషన్


బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వంతెనపై నిలిచిన నీరు


మాడుగులలో వర్షం

అకాల వర్షం.. జనం హర్షం

- వాతావరణంలో మార్పుల కారణంగా ఉరుములు, మెరుపులతో కుండపోత
- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు
- విద్యుత్‌కు అంతరాయం
- పిడుగుపాటుకు రావికమతం మండలం గుడ్డిపలో రెండు పశువులు, దేవరాపల్లి మండలం రైవాడలో విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత

చోడవరం, మే 7 : మండు వేసవి కారణంగా ఎండలతో అల్లాడుతున్న జనంపై వరుణుడు కరుణ చూపాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా కుండపోత వాన పడడంతో అంతటా చల్లబడి ఉపశమనం పొందారు. గత పదిహేను రోజులుగా భానుడు విశ్వరూపం చూపుతున్నారు. రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. దీనికితోడు వడగాల్పులు మరింత ఉక్కిరి బిక్కిరి చేశాయి. దీంతో మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి చాలా చోట్ల రోడ్లు నిర్మానుష్యంగా కనిపించేవి. వాతావరణంలో మార్పుల కారణంగా చోడవరం మండలంలో సోమవారం అర్ధరాత్రి, తిరిగి మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి 10గంటల వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది.



చోడవరం పట్టణంలో ఉదయం కుండపోతగా కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట : మండలంలో మంగళవారం పలు దఫాలుగా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో పడిన వర్షానికి అంతటా చల్లబడింది. దీంతో వేసవి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం చెరకు, సరుగుడు, ఆయిల్ పామ్ పంటలకు ఉపయోగకరమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రావికమతం : నిప్పుల కుంపటిలా మారిన ఈ ప్రాంతం మంగళవారం కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం గాలి, ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన పడింది. అదే సమయంలో పిడుగుపడి గుడ్డిప గ్రామంలో రెండు పాడి ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గల్ల చినబాబులు అనే రైతు తన రెండు ఆవులకు ఉదయం పాలు పితికిన అనంతరం పాక వద్ద కట్టి, గ్రాసం వేసి వెళ్లిపోయాడు. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్య పెద్ద శబ్దంతో ఆ ప్రాంతంలో పిడుగు పడింది. దీంతో ఆ ఆవులు గిలగిలా కొట్టుకుని మృతి చెందాయి. రూ.లక్షా 60వేలు వెచ్చించి ఆరు నెలల క్రితం కొన్నానని, ఇలా పిడుగుపాటుకు ఆవులు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాల్సిందిగా కోరారు.

రోలుగుంట : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు మరింత దారుణంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడ గోతులు పడడంతో వాటిలో నీరు చేరడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలావుంటే, వర్షం కారణంగా వాతావరణం చల్లబడడంతో సేదదీరారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలో మంగళవారం ఉదయం ఈదురు గాలుతో భారీ వర్షం కురిసింది. దీంతో ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, చోద్యం తదితర గ్రామాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా ఏఎల్‌పురంలో కావలు సరిగా లేకపోవడంతో మురుగుతో కలిసి వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో వర్షపు నీరు చెరువును తలపించింది. అయితే ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాతవరం: మండలంలో మంగళవారం ఉదయం సుమారు గంటపాటు కుండపోత వాన కురిసింది. దీంతో వాతావరణం అంతటా చల్లబడింది. పలు గ్రామాల్లో రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలకు జనం ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం నువ్వుపంట వేసేందుకు దుక్కి దున్నడానికి ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాకవరపాలెం : వాతవరణంలో మార్పుల కారణంగా మంగళవారం ఉదయం నుంచి మాకవరపాలెం మండలంలో మోస్తారు వర్షం కురిసింది. గత ఇరవై రోజుల నుంచి మండుతున్న ఎండలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం వల్ల ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

మాడుగుల/ మాడుగుల రూరల్ : మండలంలో భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి పది గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా వానపడింది. అలాగే, మంగళవారం ఉదయం కుండపోతగా కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

దేవరాపల్లి : మండలంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి పది మిల్లీమీటర్లు, మంగళవారం ఉదయం ఇరవై మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత పదిహేను రోజుల నుంచి ఎండలతో ఇబ్బందులు పడుతున్న జనం ఒక్కసారిగా చల్లబడడంతో సేదదీరారు. ఇదిలావుంటే, రైవాడలో వనుమురెడ్డి ఈశ్వరమ్మకు చెందిన పాడె గేదె విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. జగనన్న కాలనీ వద్ద మంగళవారం మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది.

కె.కోటపాడు : ఉరుములు, మెరుపులతో మండలంలో మంగళవారం ఉద యం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో తాజా వర్షానికి వాతావరణం చల్లబడింది. రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చీడికాడ : మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో అన్ని గ్రామాల్లో చల్లదనం ఏర్పడింది. సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అలాగే మంగళవారం ఉదయం సుమారు రెండుగంటల పాటు ఏకధాటిగా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. ఈ వర్షం పశు గ్రాసం పెరుగుదలకు, వేసవి దుక్కులకు మేలుచేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి గెలుపుతోనే మంచిరోజులు

- ఐదేళ్లుగా వైసీపీ అరాచక పాలన
- వేములపూడి ఎన్నికల ప్రచార సభలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్న


వేములపూడి ప్రచార సభలో మాట్లాడుతున్న సీఎం రమేష్, చిత్రంలో అయ్యన్న, ముత్యాలపాప

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 7 : ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో అన్నిరంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలంతా ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని వేములపూడిలో మంగళవారం రాత్రి ఏర్పాటైన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. గత ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి ఒక్క చాన్స్ అంటూ.. ఎన్నెన్నో హామీలు ఇచ్చి అమలు చేయలేకపోయారని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. మళ్లీ రాష్ట్రం గాడినపడేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం మాజీ మంత్రి, నర్సీపట్నం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశామన్నారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన సీఎం జగన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా ప్రజలంతా బుద్ధి చెప్పాలని కోరారు. వైసీపీ పాలనలో అన్నింటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం బాగుపడాలన్నా, సామాన్య, మధ్యతరగతి ప్రజల బతుకులు మెరుగుపడాలన్నా కూటమి అభ్యర్థులకు ప్రజలంతా పట్టం కట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బోళం ముత్యాలపాప, జడ్పీటీసీ సుకల రమణమ్మ, మాజీ ఎంపీపీ బోళం వెంకటరమణ, వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళం రాంప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, స్థానిక సర్పంచ్ నక్కపల్లి నూకాలమ్మతో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమర్థుడైన చంద్రబాబుతోనే ప్రజలకు మేలు

- నియోజకవర్గ అభివృద్ధికి కూటమిని గెలిపించండి
- ఎన్నికల ప్రచారంలో చోడవరం టీడీపీ అభ్యర్థి రాజు


పెదమదీనలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు

బుచ్చెయ్యపేట, మే 7 : చంద్రబాబు పాలనతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని కూటమి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. వడ్డాది, పెదమదీనా, చినమదీనా, నీలకంఠాపురంలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఐదేళ్ల జగన్ విధ్వంస పాలన కారణంగా రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. అయినప్పటికీ రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రణాళిక చంద్రబాబు వద్ద ఉందన్నారు. పరిశ్రమల స్థాపనతో లక్షల ఉద్యోగాలు కల్పిస్తే రాష్ట్ర ఆదాయం రెటింపు అవుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలంతా సమర్థవంతమైన పాలన అందించే చంద్రబాబునాయుడును సీఎంను చేయాలని కోరారు. ఒక్కచాన్సు ఇచ్చి కరణం ధర్మశ్రీని గెలిపించినందుకు నియోజకవర్గం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. మలిక సదుపాయాల కల్పనకు, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అభివృదికి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సైకిల్ గుర్తుపై తనకు, కమలం గుర్తుపై ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, గేదెల సత్యనారాయణ, వియ్యపు మహాలక్ష్మి, వియ్యపు అప్పారావు, కె.సత్యనారాయణ, ఎం.బాబ్జిలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో యాదవులకు రాజకీయ గుర్తింపు కరువు'


సమావేశంలో మాట్లాడుతున్న రాములుయాదవ్

చోడవరం, మే 7 : రాష్ట్రంలో యాదవులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయి తప్ప, వారికి రాజకీయంగా గుర్తింపు ఇవ్వడం లేదని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ వాపోయారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన యాదవుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో యాదవులు గణనీయ సంఖ్యలో ఉన్నప్పటికీ, వారికి టికెట్లు ఇచ్చే విషయంలో వైసీపీ, బీజేపీ, టీడీపీలు ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. యాదవులకు గుర్తింపు ఇచ్చిన భారత చైతన్య యోజన పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ నమ్మి అప్పలరాజుకు అంతా మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. యాదవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడిబోయిన బాబ్జి యాదవ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమస్యలతో పాటు, స్టీల్‌ప్లాంట్, విశాఖకు రైల్వేజోన్, మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలపై వైసీపీ, కూటమి పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈసరపు శేఖర్, జాతీయ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, నమ్మి అప్పలరాజు, సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి యాదవ్, సానబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో పలువురు చేరిక


పార్టీలో చేరిన వారితో కౌన్సిలర్ రాజేష్

గొలుగొండ, మే 7 : మండలంలోని ఎర్రవరం పంచాయతీలో మంగళవారం పలువురు వైసీపీ నుంచి టీడీపీ చేరారు. వార్డు సభ్యుడు సియ్యాద్రి చిరంజీవి, గ్రామ వలంటీరు అనిమిరెడ్డి తాతబాబు తదితరులతో పాటు మరో పది కుటుంబాలు వైసీపీని వీడడంతో వీరికి మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎర్రవరం టీడీపీ నాయకులు అమరపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు



నాతవరం, మే 7 : మండల కేంద్రం నాతవరంలో గల శ్రీశక్తి పంచాయతన (కనకదుర్గ) ఆలయ రెండో వార్షికోత్సవం బుధవారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం నాలుగు వేల మందికి అన్నసమారాధన జరపనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో స్వామివారికి భక్తుల పూజలు

కె.కోటపాడు, మే 7 : ఇక్కడి అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అభయాంజనేయ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

'ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలి'


యాక్టు ప్రతులను చింపుతున్న బండారు, గవిరెడ్డి

దేవరాపల్లి, మే 7 : వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ల్యాండు టైటిల్ యాక్టును రద్దు చేయాలని మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం సదరు జీవో కాపీ ప్రతులను చింపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాత తండ్రులు సంపాదించి పెట్టిన భూముల పాస్ పుస్తకంపై జగన్‌రెడ్డి బొమ్మ ముద్రించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో నాయకులు పోతల పాత్రునాయుడు, సూర్యనారాయణ రామారావు, నానాజీ, వారాది రమణ, కర్రి నాయుడు తది తరులు పాల్గొన్నారు.

'ప్రజల భూముల కాజేసేందుకు ఎత్తులు'

బుచ్చెయ్యపేట, మే 7 : ప్రజల భూములను కాజేసేందుకే జగన్‌రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టం తెచ్చిందని టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సదరు యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొంకిన అప్పలనాయుడు, గణపతిరాజు శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.